



విద్యార్థి శ్రీవిద్యకు ప్రశంసాపత్రం అందజేస్తున్న సీఎం

ప్రతి విద్యార్థీ రాజ్యాంగం చదవాలి

- కులాల పేరిట విభజించడం సరికాదు
- హక్కులకు భంగం కలిగిస్తే అడ్డుకోవాలి
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మనిషిని మనిషిగా చూడాలనేదే మానవకులమని అది రాజ్యాంగంతోనే సాధ్యమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. 'సంవిధాన ఓదు' అభియాన కర్ణాటక ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన రాజ్యాంగం వ్యాసరచన పోటీల విజేతలకు సీఎం సిద్దరామయ్య బహుమతులను మంగళవారం ప్రదానం చేశారు. అధికారిక నివాసం కృష్ణలో జరిగిన కార్యక్రమంలో సంవిధాన ఓదు అభియాన నిర్వాహకులు, మాజీ న్యాయమూర్తి నాగమోహన్‌దాస్, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీటీ శ్రీనివాసనాయక్, కన్నడ అధ్యాపకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి, సంవిధాన ఓదు అభియాన సంచాలకులు రాజశేఖరమూర్తి పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులతో సీఎం సిద్దరామయ్య ఇష్టాగోష్టి మాట్లాడారు. మనిషిని మనిషిగా చూసే వ్యక్తిత్వం ముఖ్యమని కానీ కులాల పేరిట మనిషిని విభజించే సంప్రదాయం దేశంలో సాగిందన్నారు. రాజ్యాంగం వచ్చిన తర్వాతే మనుషులంతా సమానమనేది సాధ్యమైందని, ప్రతి ఒక్కరికీ ఒకే విధమైన ప్రాథమిక హక్కులు ఉంటాయన్నారు. మానవకులం కోసం నేటి విద్యార్థులు పాటుపడాలని అది సాధ్యం కావాలంటే రాజ్యాంగాన్ని సంపూర్ణంగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. ఉన్నత విద్యతో వ్యక్తిత్వంలో మార్పు పొందాలని, మూఢ నమ్మకాలవైపు వెళ్లరాదని సమాజంలో చైతన్యం తీసుకురావాలన్నారు. రాజ్యాంగాన్ని భంగం చేసేందుకు కొందరు కుట్ర చేస్తున్నారని, సాటి మనిషికి విద్రోహం కల్పించేవారన్నారు. సమానత్వం అనేది రాజ్యాంగం సృష్టించిన మహా వరమని, కులాల వారీగా మనుషులను విభజించడం తగదన్నారు. జస్టిస్ నాగమోహన్ దాస్ పదవీవిరమణ తర్వాత కూడా రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు నిరంతరంగా పోరాటం చేస్తున్నారని కొనియాడారు. కోలారు జిల్లా విద్యార్థిని హెచ్‌హెచ్ శ్రీవిద్య ప్రథమ బహుమతి సాధించగా, కొప్పళ జిల్లా కనకగిరికి చెందిన శశికళ శంకరప్ప ద్వితీయ స్థానంలోనూ, చిత్రదుర్గ జిల్లా సిరిగెరె శ్రీరక్షకు తృతీయ బహుమతి రాగా సీఎం విద్యార్థులకు ప్రశంసాపత్రంతోపాటు నగదు బహుమతి అందచేశారు. మరో 30మందికి కన్సొలేషన్ బహుమతులను అందజేశారు.

విద్యాశాఖకు విఘ్నాలు

- శిథిలావస్థ భవనాలకు గ్రాంట్లు కరువు
- ఉపాధ్యాయుల భర్తీ పెను సవాల్
- అతిథి అధ్యాపకులతోనే కళాశాలలు
- తల్లిదండ్రులకు తప్పని 'ప్రైవేట్' భారం



కొడగు జిల్లాలో పాడుబడిన పాఠశాల



బెంగళూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమాజం అభివృద్ధి చెందాలంటే విద్యా శాతం పెరగడం, రోడ్డు మార్గాలు సరళీకృతం చేయాలనేది దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇస్తున్న హామీలు. దేశంలోనే ప్రాథమిక నుంచి ఉన్నత విద్యదాకా గుణాత్మకతకు కర్ణాటకకు గుర్తింపు ఉంది. అయితే ప్రాథమికంగా విద్యాశాఖలో పరిశీలించేకొద్దీ ఎన్నెన్నో విఘ్నాలు బయట పడుతున్నాయి. ప్రాథమిక, హైస్కూల్‌స్థాయిలో ఉపాధ్యాయుల కొరత అతిపెద్ద సమస్యగా మారింది. ఉపాధ్యాయులు లేకపోవడం ద్వారా గుణాత్మకత విద్యపై పెను ప్రభావం చూపడ మే కాక ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశించేందుకు విద్యార్థులు వెనుకడుగు వేస్తున్నారు. ఉన్న ఒకరిద్దరు పిల్లలను మంచి విద్యాసంస్థల్లో చదివించాలనే ఆసక్తి తల్లిదండ్రులలో పెరుగుతోంది. అయితే సరైన విద్య అందక తల్లిదండ్రులు తీవ్ర వేదనకు గురవుతున్నారు.

ఉపాధ్యాయుల కొరత

రాష్ట్రంలో 1.41 లక్షలమంది ఉపాధ్యాయుల కొరత నెలకొంది. దేశంలోనే ఖాళీ ఉండే ఉపాధ్యాయుల జాబితాలో కర్ణాటక ముందంజలో ఉంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సిద్ధం చేసిన 'తప్పనిసరి విద్యాహక్కు చట్టం' తన నివేదికలో ఈ విషయాన్ని ప్రస్తావించింది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో కలిపి 70,915 పాఠశాలలు ఉన్నాయి. 1 నుంచి పదో తరగతి దాకా 1.04 కోట్లమంది విద్యార్థులు చదువు తున్నారు. రాష్ట్రంలో 3.83 లక్షలమంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రతి 35మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలనే నిబంధన ఉండగా హైస్కూల్‌లో 68మందికి ఒకరు చొప్పున ఉన్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలు

రాష్ట్రంలో 6,400 ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కరే ఉపాధ్యాయులు ఉన్నారు. 50కంటే తక్కువమంది విద్యార్థులు కల్గిన పాఠశాలల సంఖ్య 23వేల దాకా ఉన్నాయి. మరో నాలుగేళ్లలో ఏకంగా 39వేలమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతారు. రాష్ట్ర ప్రభుత్వం 15వేలమంది ఉపాధ్యాయులను నియమించుకునే ప్రక్రియ సంపూర్ణం కాలేదు. కానీ 13వేలమంది ఉపాధ్యాయులు విధులలోకి చేరడంతో ఉపాధ్యాయుల కొరతలో కొంతమేర ఉపశమనం కల్పించినట్లయ్యింది. 2019లో 10,565 మంది ఉపాధ్యాయుల నియామకాలపై జరిగిన ప్రక్రియలో ఎంపికైన వారు కేవలం 3వేలమంది మాత్రమే. ఇటీవల ఆరు నెలలుగా 10వేల మంది ఉపాధ్యాయులను నియమించే ప్రక్రియ చేపడతామని విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప చెబుతున్నా ఇప్పటివరకు నోటిఫికేషన్ విడుదల కాలేదు. ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో అకడమిక్ పూర్తిగా కుటుంటుపడుతుందని ఏకంగా 45వేలమంది అతిథి ఉపాధ్యాయులను నియమించుకుని తరగతుల కొనసాగిస్తున్నారు.

శిథిలమైన భవనాలు

రాష్ట్రంలో 3,819 పాఠశాల భవనాలు శిథిలావస్థదశలో ఉన్నాయి. వాటిని మరమ్మతు చేసేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.852 కోట్లు కేటాయించింది. 2023 - 25లో శిథిలావస్థ భవనాల పునరుద్ధరణకు రూ.600 కోట్లు ఖర్చు చేశారు. ఇలా ఏటా గ్రాంట్ల కొరత ఉండడంతో ప్రభుత్వం వివిధ కంపెనీల సీఎస్ఆర్ నిధుల కోసం ప్రయత్నిస్తోంది. ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు కాలానుగుణంగా నియామకాలు జరపాలి. శిథిలావస్థ దశలో ఉన్న భవనాలకు ప్రత్యేక ప్యాకేజీల కింద గ్రాంట్లు విడుదల చేయాలి. పొరుగున ఉండే కేరళ ప్రభుత్వం ఐదేళ్ల వ్యవధికోసం ఏటా గ్రాంట్లతోపాటు అదనంగా 10వేల కోట్ల రూపాయలు రిజర్వు చేసి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను, కంప్యూటర్లను, ల్యాబ్‌లను సమకూరుస్తోంది. అదే తరహాలో రాష్ట్రంలోనూ కేటాయిస్తే సమస్యలు పరిష్కారం కానున్నాయి. వీటితోపాటు కన్నడ మీడియం పాఠశాలలకు గ్రాంట్ల కొరత ఉంది. పాఠశాలల్లో ఇప్పటికీ తాగునీరు, శౌచాలయాల కొరత వెంటాడుతోంది. అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం లేదు. ఆర్‌టీఈ చట్టానికి అనుగుణంగా ప్రతి పాఠశాలకు సమకూర్చాల్సిన మౌలిక సదుపాయాలు సాధ్యం కావడం లేదు. ఇటువంటి ప్రభావంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లపై చూపుతోంది. రాష్ట్రంలో 46,757 ప్రభుత్వ పాఠశాలల్లో 42.92 లక్షలమంది విద్యార్థులు ఉన్నారు. కానీ 16,435 ప్రైవేట్ పాఠశాలల్లో 46.58 లక్షలమంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులను ఆకర్షించేలా ఇంగ్లీష్ మీడియం ప్రారంభించినా అడ్మిషన్లు పెరగలేదు. ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే 20వేలకుపైగా తక్కువగా ఉండే ప్రైవేట్ పాఠశాలల్లో 4లక్షలమందికంటే ఎక్కువ విద్యార్థులు ఉన్నారు.

అధ్యాపకులేరీ?

రాష్ట్రంలో 1232 ప్రభుత్వ పీయూ కళాశాలలు ఉండగా 12,917 అధ్యాపకుల పోస్టులు మంజూరయ్యాయి. ప్రస్తుతం 8,356 మంది పనిచేస్తుండగా 4,561 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎయిడెడ్ కళాశాలల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అక్కడ 4291 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీబీఎస్ఈలో 11, 12 తరగతు ల్లో 45మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉండాలి. కానీ రాష్ట్రంలో 360 మందికి ఓ అధ్యాపకుడు ఉన్నారు. ఈలెక్కన సీబీఎస్ఈ నిబంధనల ప్రకారం 8రెట్ల ఎక్కువమంది విద్యార్థులకు ఒకరు బోధించే పరిస్థితి ఉంది. విద్యాశాఖలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందని విద్యానిపుణులు అభిప్రాయపడుతున్నారు.



నాపై దుష్ప్రచారం తగదు..

- రాజ్యాంగ మార్పు గురించి ప్రస్తావించలేదు
- సీఎం సిద్దరామయ్య ఆరోపణలు బాధాకరం
- పెజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామీజీ

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం మార్పు చేయాలని వ్యాఖ్యానించక పోయినా కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని పెజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామిజీ విచారం వ్యక్తం చేశారు. బెంగళూరులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల విశ్వహిందూ పరిషత్ నేతృత్వంలో జరిగిన సాధువుల సభలో తీసుకున్న నిర్ణయాలపై గవర్నర్‌కు ఇచ్చిన వినతిలో రాజ్యాంగానికి సంబంధించి ఎటువంటి ప్రస్తావనలు లేవన్నారు. అయినా తప్పుడు ఆరోపణలతో నిరసనలు సాగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న సీఎం సిద్దరామయ్య కూడా నిరాధార ఆరోపణలపై స్పందించడం సరికాదన్నారు. పరిశీలించి మాట్లాడాల్సి ఉండేదని, సమాజంలో గొడవలు సృష్టించే తరహాలో ఎవరూ ప్రయత్నించరాదన్నారు. హిందువుల భావనలకు ప్రాధాన్యం ఇచ్చే అధికారం తీసుకురావాలని వ్యాఖ్యానించానని రాజ్యాంగాన్ని మార్పు చేయాలని, సవరించాలని ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. రాజ్యాంగం అనే శబ్దమే ప్రయోగించలేదని, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు అందరికీ సమానం అనేలా ఉండాలన్నారు. ప్రతి ఎన్నికల్లో ఓటు వేస్తున్నా అని, రాజ్యాంగ వ్యతిరేకమైన చర్యకు ఎప్పుడూ పాల్పడలేదన్నారు. సమాజంలో అన్ని కులాలవారితో సన్నిహితంగా ఉన్నామన్నారు. తనను ఎందుకు టార్గెట్ చేస్తున్నారో తెలియదని వాపోయారు. తనపై దుష్ప్రచారం ద్వారా హిందూ సమాజానికి నష్టం కలిగించడం సాధ్యం కాదన్నారు. న్యాయపోరాటం కంటే ఎన్నో పనులు ఉన్నాయన్నారు. దేవుడు అందరికీ మంచి బుద్ధి ఇవ్వాలని ప్రార్థిస్తానన్నారు. హిందూ సంఘాలపై దుష్ప్రచారం కోసమే తన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారన్నారు. ఇకపై ఇలాంటి ప్రచారాన్ని అడ్డుకుంటామన్నారు. స్వామీజీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బీకే హరి ప్రసాద్ మాట్లాడుతూ.. స్వామీజీ వ్యాఖ్యలను మార్పు చేసి మాట్లాడడం సరికాదన్నారు. సమాజాన్ని దారి తప్పించేలా ఉన్నాయన్నారు.

ఢిల్లీ చేరిన బీజేపీ రెబెల్స్ కూటమి

బెంగళూరులో కోర్ కమిటీ సమావేశం

బీజేపీ రెబెల్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ నేతృత్వంలోని పోరాటం పార్టీలో విబేధాలను తారస్థాయికి చేర్చింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను వ్యతిరేకిస్తున్న కూటమి సభ్యులంతా మంగళవారం ఢిల్లీకి చేరారు. రెండురోజుల కిందటే యత్నాళ్ ఢిల్లీకి చేరుకోగా తాజాగా రమేశ్ జార్కిహొళి, బీవీ నాయక్, అరవింద లింబావళి, కుమార బంగారప్ప, సంతోష్ తదితరులు వెళ్లారు.

వివరాలు.. 7లో..

తల్లిదండ్రులు, గురువుల మార్గదర్శకమే కీలకం

- బ్రహ్మశ్రీ వెంకటేశ్వరస్వాములు



వెంకటేశ్వరస్వాములకు సన్మానంలో శ్రీనివాసరెడ్డి

హోసూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక మార్గంలోగానీ, జీవితంలో ఉన్నత స్థానాలను సాధించేందుకుగానీ తల్లిదండ్రులు, గురువుల మార్గదర్శకమే కీలకమని బ్రహ్మశ్రీ వెంకటేశ్వరస్వాములు అభిప్రాయపడ్డారు. కైవార నారేయణ తాతయ్య ఆశ్రమంలో స్వామీజీ 83వ జన్మదిన వేడుకలను బ్రహ్మశ్రీ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో మంగళవారం భక్తుల దినోత్సవంగా ఆచరించారు. స్వామిజీకి కిరీటధారణం చేసి ఊరేగారు. ఆశ్రమానికి చేరుకుని భీమేశ్వరుడు, నారేయణేతాతయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. గురువుల స్థానం పొందాలంటే ఎన్నో ఏళ్ల సాధన, క్రమశిక్షణ, భక్తి ఉండాలన్నారు. ఎంతోమంది ఆధ్యాత్మిక మార్గంలో సాగేందుకు గురువుల బోధనలే కారణమన్నారు. దేవుడు ఎక్కడో లేడని గురువులు, తల్లిదండ్రుల రూపంలో ఉన్నారన్నారు. మనం చేసే ప్రతి మంచి పనుల్లోను దేవుడు ఉంటారన్నారు. మనం చేసే పనుల ఫలితం దైవేచ్ఛ ప్రకారమే ఉంటుందన్నారు. అంతేగానీ తాను ఆ క్షేత్రానికి వెళ్లానని, ఈ క్షేత్రానికి వెళ్లానని కాలాన్ని వృథా చేయరాదన్నారు. కాలక్రమేణా ఎన్ని మార్పులు వచ్చినా అదంతా దైవ నిర్ణయమే అన్నారు. ప్రతి ఒక్కరూ దైవాన్ని విశ్వసించి జీవనం సాగిస్తే ప్రశాంతత లభిస్తుందన్నారు. చరమాంకంలో శరీరం, బంధుత్వాలపై మోహం వీడి వైరాగ్య దిశగా సాగడం ద్వారా మానసిక తృప్తి ఉంటుందన్నారు. పలువురు భక్తులు స్వామిజీకి పాదపూజ నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి విచ్చేసిన సాధువులకు వస్త్రాలు, కానుకలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ఊరేగింపులో..



రోడ్డుపైకి దొర్లిన బండరాయి

పలు జిల్లాల్లో కొనసాగిన వర్షం

- చాముండి కొండలపై విరిగిపడిన బండరాయి
- బెంగళూరులో జోరువానతో ట్రాఫిక్ సమస్యలు

ఫెంగల్ తుఫాను ప్రభావం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెండో రోజూ కొనసాగింది. పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బెంగళూరులో మధ్యాహ్నం మొదలైన వాన సాయంత్రం దాకా ఆగలేదు..

7

పోస్టాఫీసులు కిటకిట

- పీఎం, సీఎం డబ్బులు వేస్తారని పుకార్లు
- ఖాతాలు తెరవడానికి తరలివస్తున్న మహిళలు



కలబురగి జిల్లాలో మహిళలతో కిటకిటలాడుతున్న పోస్టాఫీసు

ఇటీవల చాలామంది జనం పోస్టాఫీస్‌లను మరిచిపోయారని చెప్పవచ్చు.. రెండు, మూడు రోజులుగా పలు జిల్లాల్లోని పోస్టాఫీస్‌లు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. పోటీ పడి మరీ పొదుపు ఖాతాలు తెరుస్తున్నారు.

7

ప్రతి విద్యార్థినీ ప్రతిభావంతుడిగా మార్చడమే లక్ష్యం

- 'నారాయణ' డైరెక్టర్ సింధూర

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే నారాయణ విద్యాసంస్థల లక్ష్యమని డైరెక్టర్ డాక్టర్ పి సింధూర అభిప్రాయపడ్డారు. నారాయణ నీట్ అకాడమీ, కువెంపు భవన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వసంతనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో 'రంగమంచ్'ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సింధూర మాట్లాడుతూ 121మంది విద్యార్థులు నీట్‌లో ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. కువెంపు భవన్ ద్వారా ఆరేళ్లలో 500మంది ఎంబీబీఎస్‌కు అర్హత సాధించేలా తీర్చామన్నారు. ప్రతి విద్యార్థికి చదువుకుని రాణించాలని ఉంటుందని అయితే అందుకు తగిన వాతావరణం మార్గదర్శకం, చదువుకునే విధానం, పోటీ తత్వం, అకడమిక్ అంశాలలో రాణించేలాంటి మెళకువలు నేర్పడమే నారాయణ నిరంతరంగా శ్రమిస్తోందన్నారు. రానున్న ఏడాది కనీసం 160మంది నీట్‌లో ర్యాంకులు లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. నీట్‌లో ర్యాంకులు సాధించిన 121మంది విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు. వారి ఆలోచనలను సింధూర అడిగి తెలుసుకున్నారు. కువెంపు భవన్ కోర్ డీన్ బీవీ నాగరాజు మాట్లాడుతూ కువెంపు భవన్‌లో అత్యాధునిక మౌలిక సదుపాయాలతోపాటు అనుభవం కల్గిన అధ్యాపకులు మా బలమన్నారు. ప్రతి విద్యార్థికి మెంటారింగ్ విధానంతో తీర్చుతున్నామన్నారు. నారాయణ విద్యాసంస్థలు దేశంలోని 23 రాష్ట్రాలలో 230 నగరాలలో 800కుపైగా పాఠశాలలు, కళాశాలలు కొనసాగుతున్నాయన్నారు. 45ఏళ్లుగా గుణాత్మక విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.



రంగమంచ్ కార్యక్రమంలో నారాయణ డైరెక్టర్ సింధూర

ముడా కేసులో ఈడీ విచారణకు

ఐఏఎస్ అధికారి



ఐఏఎస్ అధికారి దీపాచోళన్

బెంగళూరు, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): ముడా ఇంటి స్థలాల వివాదంలో నగరాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి దీపాచోళన్ ఈడీ విచారణకు హాజరయ్యారు. నోటీసులు జారీ చేసిన మేరకు మంగళవారం బెంగళూరు శాంతినగర్‌లోని ఈడీ కార్యాలయానికి రికార్డులతో పాటు సెక్రటరీ హాజరయ్యారు. దాదాపు సాయంత్రం దాకా విచారణలు కొనసాగాయి. నగరాభివృద్ధి శాఖ ఉద్యోగులకు నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది. అధికారుల విచారణల తర్వాత సంబంధిత మంత్రికివిచారణకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. ఇప్పటివరకు సాగిన విచారణలతో పోలిస్తే విధానసౌధలో ఐఏఎస్ అధికారి దీపాచోళన్ స్వయంగా స్వయంగా వెళ్లడంతో ఇతర అధికారులలో వణుకు పట్టుకుంది.

‘అపార్’ ఇబ్బందులు తొలగించండి

విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కోరిన మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం/ ఉరవకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అపార్ జనరేషన్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. ఈ మేరకు మంగళశారం ఆయన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. జిల్లాలో రెండ్రోజుల కిందట బెళుగుప్ప మండలం కోనాపురం నుంచి గోళ్ల గ్రామానికి వెళ్తుండగా... మార్గమధ్యంలో పొలాల్లో పనిచేస్తున్న కూలీలతో తాను మాట్లాడినట్లు తెలిపారు. ఈ సందర్భంలో కూలీలు తమ పిల్లలకు సంబంధించి అపార్ జనరేషన్ కోసం ఎదురవుతున్న ఇబ్బందులు తన దృష్టికి తెచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. అపార్‌కు అవసరమైన ఆధార అప్డేషన్ కోసం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారని మంత్రి లోకేశ్‌కు పయ్యావుల వివరించారు. బెళుగుప్ప నుంచి కళ్యాణదుర్గానికి వెళ్లి రావడానికి చార్జీలు, ఫీజులు, నోటరీ చేయించేందుకు రూ. 800 నుంచి 1000లు అడుగుతున్నారని, ఆధార్ సర్వీస్ సెంటర్లలో డబ్బులు చెల్లించేందుకు దాదాపు రూ.2 వేల నుంచి రూ.3 వేలు ఖర్చవుతోందని తనతో కూలీలు ఆవేదన వ్యక్తం చేసినట్లు లోకేశ్‌కు వివరించారు. 35 శాతం మంది విద్యార్థులు పేరు మార్పులు, పుట్టిన తేదీలు, తదితర వివరాలు మార్పు చేసుకునేందుకు నోటరైజ్ అఫిడవిట్ అడుగుతున్నారని తెలిపారు. సాధారణ కూలీలు, దిగువ, మధ్య తరగతి ప్రజలు తమ పిల్లల అధార్ అప్డేషన్ కోసం ఇబ్బందులు పడుతు న్నారని ఆయన నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆధార్ అప్డేషన్‌లో ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.



రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో మంత్రి పయ్యావుల కేశవ్

ఉపాధి కోర్సులపై ఉచిత శిక్షణ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించే కోర్సులపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. సంభవ్ ఫౌండేషన్, కియ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, ఐటీఐ అర్హత గల విద్యార్థులకు డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్ ఎగ్జిక్యూటివ్, సర్వీస్ టెక్నీషియన్, డిగ్రీ బీకామ్, బీటెక్, ఐటీఐ కోపా విద్యార్థులకు డేటా అనాలసిస్ కోర్సులపై శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు 7981989190, 9618488031 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

లింగ వివక్షలేని సమాజ స్థాపనకు కృషి

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి



లింగవివక్షపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీలో మంగళవారం డీఆర్‌డీఏ-వెలుగు, ఐసీడీఎస్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీలు మాట్లాడుతూ లింగ వివక్ష హింసకు వ్యతిరేకంగా కలికట్టుగా పనిచేసి, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, ఎటువంటి వివక్ష లేని సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 18సంవత్సరాలు వయసు వచ్చే వరకు బాలికలకు వివాహం చేయరాదని, సొంతకాళ్లపై నిలబడేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడాప్ జేడీఎం సూర్యనారాయణ, ట్రైనర్లు ప్రతాప్‌రెడ్డి, నారాయణస్వామి, మునీంద్ర, సాయికిరణ్, మధుసూదన్, ఐసీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అరటి సాగు అదుర్స్!



అరటిగెల

కూడేరు మండలంలో పెరిగిన సాగు విస్తీర్ణం

అన్నదాతల జాగ్రత్తలతో అధిక దిగుబడులు

పండిన పంట విదేశాలకు ఎగుమతి



కూడేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో పండిస్తున్న ఉద్యాన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ సారవంతమైన ఎర్రనేలలు ఉండటంతో పంటల దిగుబడి కూడా బాగా వస్తోంది. మండలంలో చీనీ, మామిడితోపాటు అరటి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించిన పంటలను ముఖ్యంగా అరటిని ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా అరటి పంట మండలంలో చెప్పుకోదగ్గ స్థాయిలో సాగవుతోంది. ఈక్రమంలోనే అరటి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. హెక్టారుకు మొదట పంట సాగుకు రూ.30 వేలు, రెండో పంటకు రూ. 10వేలు అందిస్తోంది.

• పెరిగిన సాగు

ఇటీవలి కాలంలో కూడేరు మండలంలో అరటి సాగు ఊపందుకుంది. కూడేరుతోపాటు రామచంద్రపురం, కడదరకుంట, చోళసముద్రం, జయపురం, ఎంఎంహళ్లి తదితర గ్రామాల్లో దాదాపు 150 ఎకరాల వరకు అరటి సాగు చేశారు. సాధారణంగా రైతులు కేఎఫ్, ఏసీ, షెక్రోసన్, జైయిన్ తదితర రకాల అరటి పిలకలను బెంగళూరు, హైదరాబాద్, మైసూర్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారుల ద్వారా తెప్పించుకుని, సాగు చేస్తారు. ఎకరాకు 1450 మొక్కలు నాటుతారని, ఒక్కొక్క మొక్క రూ.15 నుంచి రూ.20తో కొనుగోలు చేస్తారు. అరటి పంట సాగు ప్రారంభం నుంచి చివరి వరకు ఎకరాకు దాదాపు లక్షన్నర వరకు పెట్టుబడి వస్తుంది. దిగుబడి ఆశాజనంగా ఉంటే ఎకరాకు దాదాపు 20 నుంచి 25 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం ధర టన్ను రూ.13 వేల నుంచి రూ.18 వేల వరకు ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ఇక్కడి పంట విదేశాలకు..

మండలంలో పండించిన అరటి పంటను ఇరాక్, ఇరాన్ వంటి ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. అరటి తోట వద్దే వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు పంటను కొనుగోలు చేస్తున్నారు. కోతల అనంతరం వివిధ మార్గాల ద్వారా విదేశాలకు, దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. పంట సాగు చేసినప్పటి నుంచి కోత వరకు అన్నదాతలు తీసుకుంటున్న జాగ్రత్తల వల్ల పంట దిగుబడి బాగా వస్తున్నట్లు రైతులు తెలిపారు.



అరటి తోట

• ఎంబీఏ చదివి... అరటి సాగులో రాణించి..

రామచంద్రపురం గ్రామానికి చెందిన యువకుడు బళ్లారి వెంకటేష్ ఎంబీఏ చదివి ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండా వ్యవసాయంపై మక్కువతో అరటి సాగు చేశాడు. తనకున్న ఆరెకరాల పొలంలో అరటి సాగుచేశాడు. ఇందుకు రూ. ఆరున్నర లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపాడు. కేఎఫ్ రకం మొక్కలను బెంగళూరు నుంచి వ్యాపారులతో కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. ఒక్కో మొక్కను రూ.14తో కొనుగోలు చేసి, ఏడు వేల మొక్కలను నాటినట్లు పేర్కొన్నారు. మొదటి పంట 11 నెలలకు వచ్చింది. దిగుబడి ఆశాజనంగా రావడంతో దాదాపు 135 టన్నుల పండింది. మార్కెట్‌లో టన్ను రూ.13వేల నుంచి రూ.15 వేల వరకు అమ్ముడుపోవడంతో దాదాపు 17లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు రైతు బళ్లారి వెంకటేష్ తెలిపారు. మొదటి కోత పూర్తయిన 9 నెలల తర్వాత రెండో కోత కూడా ప్రస్తుతం సిద్ధంగా ఉందని వివరించారు.



అరటి గెలను చూపుతున్న రైతు బళ్లారి వెంకటేష్

సస్యరక్షణతో అధిక దిగుబడి



అరటి పంటలో సస్య రక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. వాతావరణంలో మార్పుల వల్ల పంటకు తెగుళ్లు సోకుతాయి. వాటి నివారణకు రసాయన మందులను ఎప్పటికప్పుడు పిచికారీ చేసుకోవాలి. అప్పుడే అరటికాయలు నాణ్యతగా ఉంటాయి. అరటి పంటకు గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటే సిగటోక మచ్చ తెగుళ్లు సోకుతుంది. వీటి నివారణకు కార్బెండిజమ్ ఒక గ్రామును ఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలి. తెగుళ్లు తీవ్రంగా ఉంటే ప్రొపికోనజోల్, మినరల్ ఆయిల్ ఒక లీటర్ నీటికి 2 ఎంఎల్ కలిపి పిచికారి చేయాలి. అలాగే పంటకు బ్యాక్టీరియా సాఫ్ట్‌రాట్ మార్చి నెలలో అధికంగా వస్తుంది. వాటి నివారణకు బ్లీచింగ్ పౌడర్ 50 గ్రాములు చెట్టు మొదలు దగ్గర వేయాలి.

-నెట్టికంటయ్య, ఉద్యాన శాఖాధికారి

నాలుగు ప్రాజెక్టుల అమలుకు చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఉన్న ఉపరితల నీటి (సర్ఫేస్ వాటర్) ద్వారా మరో 4 ప్రాజెక్టులు అమలు చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్ తెలిపారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆ ప్రాజెక్టులకు సంబంధించి పలు విషయాలను ఆయన వెల్లడించారు. జిల్లాలో ఉన్న ఉపరితల నీటి వనరులను వినియోగించుకొని రూ.480 కోట్లతో 4 మండలాల్లో నాలుగు ప్రాజెక్టుల అమలుకు అనుమతి కోసం ప్రభుత్వానికి వినతి పంపామన్నారు. అనుమతి వచ్చిన వెంటనే చర్యలు చేపడతామన్నారు. శింగనమల మండలంలోని 4 గ్రామాలు, గుంతకల్లు మండలంలోని మరో 3 గ్రామాలు, ఉరవకొండ, రాప్తాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ ప్రాజెక్టులు అమలు చేస్తామన్నారు. వీటి కోసం పీఏబీఆర్‌తో పాటు మిడ్‌పెన్నార్‌లో ఉన్న సర్ఫేస్ వాటర్‌ను పైప్‌లైన్ ద్వారా అందజేస్తామన్నారు.

తల్లీబిడ్డ మృతిపై విచారణకు త్రిసభ్య కమిటీ

అనంతపురంటౌన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో సోమవారం జరిగిన తల్లీబిడ్డ మృతిపై వాస్తవాలు తెలుసుకునేందుకు త్రిసభ్య కమిటీని నియమించినట్లు సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. రాయదుర్గం పట్టణానికి చెందిన సరళజ్యోతితో పాటు పుట్టినబిడ్డ మృతి చెందారు. ఇందుకు డాక్టర్ల నిర్లక్ష్యంమే కారణమనే విమర్శలు వచ్చాయి. ఈనేపథ్యంలో సీనియర్ వైద్యులు, సర్జన్ విభాగాధిపతి డాక్టరు రామస్వామి నాయక్, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టరు రవికుమార్, అనస్తీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టరు జగదీసాచార్యులను విచారణకు నియమించినట్లు తెలిపారు. ఈకమిటీ పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక ఇస్తుందని అందులో డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం ఉందని తేలితే చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ తెలిపారు.

రేపు ప్రాంగణ నియామకాలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీలో గురువా రం ప్రాంగణ నియామకాలు చేపడుతున్నట్లు వీసీ ఎస్ఏ కోరి మంగళవారం తెలిపారు. మానవ వనరుల నిర్వహణ, మూలధనం వంటి రంగాల్లో సేవలందిస్తున్న ఏడీపీ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీలో కనీసం 60శాతం మార్కులు సాధించిన ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులందరూ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. జంతులూరులోని సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తిల విద్యార్థులు హాజరుకావాలని కోరారు. వివరాలకు 9491490338 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

రబీ ఈ-పంట నమోదు
ఆరంభం

అనంతపురం అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు మంగళవారం ఆరంభమైంది. గత నెలాఖరులో వ్యవసాయ శాఖ సిబ్బందికి యాప్‌లో ఈ పంట నమోదు చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఈ పంట నమోదుకు 3.1 వర్షన్ యాప్ అప్లికేషన్‌ను ఇచ్చారు. ఈ పంట నమోదుతోపాటు రైతుల బయోమెట్రిక్‌ను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ ఏడాది రబీ లో పప్పుశనగ 72909 హెక్టార్లు, వరి 6928, జొన్న 4735, మొక్కజొన్న 7844 హెక్టార్ల సాగు లక్ష్యంగా నిర్ణయించారు. మిగతా విస్తీర్ణంలో ఉలవలు, పెసలు, అలసంద తదితర పంటలున్నాయి. ఇప్పటిదాకా జిల్లా వ్యాప్తంగా 71996 హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో 57970 హెక్టార్లల్లో పప్పుశనగ పంట సాగైంది.

తొలిరోజు 3వేల ఎకరాల్లో...

జిల్లాలో తొలి రోజు మంగళవారం మూడు వేల ఎకరాల్లో ఈ పంట నమోదుచేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 20లోగా ఈ పంట నమోదుతోపాటు రైతులతో బయోమెట్రిక్ వేలిముద్ర వేయించాలని ఆదేశించారు. ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు సామాజిక తనిఖీ కోసం రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించి, గ్రామసభలు ఏర్పాటు చేస్తారు. ఫిబ్రవరి 6 నుంచి 10 దాకా రైతుల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదు స్వీకరిస్తారు. ఫిబ్రవరి 15న తుది ముసాయిదా జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సిబ్బందికి రైతులు సహకరించి సకాలంలో ఈ పంట నమోదు పూర్తి అయ్యేందుకు సహకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ కోరారు.

హంద్రీనీవాకు కళ!

రూ. 936.70 కోట్లతో ప్రధాన కాలువ లైనింగ్ పనులు

నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ

అనంతపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన హంద్రీ నీవా ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వంలో ఆదరణ లభిస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు... ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఉమ్మడి జిల్లా కొచ్చిన సందర్భాల్లోనూ హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆమేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులకు ఆమోద ముద్ర వేశారు. ఆ మేరకు రూ. 936.70 కోట్లతో హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నిధులు మంజూరు చేస్తూ జీవో నెం 405 మంగళవారం జారీ చేశారు. దీంతో హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులు ఇక నుంచి వేగంగా జరగనున్నాయి.

జీడిపల్లి నుంచి...

హంద్రీనీవా ప్రాజెక్టు ఫేజ్-2లో భాగంగా జీడిపల్లి జలాశయం దగ్గర నుంచి అంటే 216.300 కి.మీ నుంచి 230 కి.మీ వరకూ రూ. 58.30 కోట్ల ఖర్చుతో లైనింగ్ పనులు చేపట్టనున్నారు. 230 కి.మీ నుంచి 245 కి.మీ వరకూ రూ. 65.60 కోట్లు, 245 కి.మీ నుంచి 260 కి.మీ వరకూ రూ. 74.30 కోట్లు, 260 కి.మీ నుంచి 280 కి.మీ వరకూ రూ. 64.20 కోట్లు, 280 కి.మీ నుంచి 300 కి.మీ వరకూ శ్రీసత్యసాయి జిల్లాలోని హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులకు రూ. 57.80 కోట్లు, 285.100 కి.మీ నుంచి 287.100 కి.మీ టన్నెల్ ఏర్పాటు కోసం రూ. 36.19 కోట్లు, 300 కి.మీ నుంచి 320 కి.మీ వరకూ పెండింగ్‌లో ఉన్న పనులకు(చెన్నేకొత్తపల్లి మండలంలో) రూ. 103.32 కోట్లు, 320 కి.మీ నుంచి 340 కి.మీ వరకూ శ్రీసత్యసాయి జిల్లాలో రూ.61.04 కోట్లు, 340 కి.మీ నుంచి 358 కి.మీ వరకూ పెండింగ్ పనులతో పాటు ప్రధాన కాలువ ఆధునికీకరణ కోసం రూ. 119.35 కోట్ల నిధులు మంజూరు చేశారు. అదే విధంగా 358.150 కి.మీ నుంచి 360.250 కి.మీ వరకూ టన్నెల్ పెండింగ్ పనులు, ఇతరత్ర నిర్మాణాలు(బుక్కపట్నం మండలం పరిధిలో) కోసం రూ. 55.40 కోట్లు, 360.400 కి.మీ నుంచి 380.150 కి.మీ వరకూ(బుక్కపట్నం మండల పరిధిలో) పెండింగ్ పనుల పూర్తికి రూ. 161.60 కోట్లు, 380 కి.మీ నుంచి 400 కి.మీ వరకూ(ముదిగుబ్బ మండల పరిధిలో) పెండింగ్ పనుల పూర్తికి రూ. 79.60 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు సంబంధిత శాఖాధికారులకు మంజూరు చేసింది.

వెడల్పు చేయకుండా
లైనింగ్ పనులా..?

జిల్లాకు తీవ్ర నష్టం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



అనంతపురం కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేస్తే జిల్లాకు తీవ్ర నష్టం కలుగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన జీఓ నెం.405 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఉందని విమర్శించారు. పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ వెడల్పు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు ప్రస్తుతం అందుకు విరుద్ధంగా జీఓ ఇవ్వడం సరికాదన్నారు. ఈ ఏడాది శ్రీశైలం ప్రాజెక్టు పొంగి పొర్లినా జిల్లాలోని చెరువులు నింపలేకపోవడానికి ప్రధాన కారణం కాలువ సామర్థ్యం తక్కువగా ఉండటమే నన్నారు. నాలుగు రోజుల కిందట జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లాను అభివృద్ధి చేస్తామని చెప్పి, ఇపుడు ఇలా కేవలం లైనింగ్ పనులకు మాత్ర మే నిర్ణయించడం దారుణమని విమర్శించారు. హంద్రీనీవా ప్రారంభమయ్యే కర్నూలు జిల్లాలో లైనింగ్ చేయకుండా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మాత్రమే ఎందుకు చేస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రూ.936.70కోట్ల లైనింగ్ పనులను 12 ప్యాకేజీల కింద విభజించడం ద్వారా జిల్లా రైతులకంటే కాంట్రాక్టర్లే ఎక్కువ లాభపడతారన్నారు. ఇరిగేషన్ శాఖకు కేటాయించిన నిధుల నుంచే ఈ కాలువ లైనింగ్ చేపడతామని జీఓలో పేర్కొనడం అనేక అనుమానాలకు తావిస్తోందని తెలిపారు.

నేడు పాలిటెక్ ఫెస్ట్

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బుధవారం రీజనల్ పాలిటెక్‌ఫెస్ట్-2024ను నిర్వహిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్య ప్రతిభాపాటవాలను గుర్తించి, వారిని ప్రోత్సహించేలా టెక్‌ఫెస్ట్-2024ను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టారని పేర్కొన్నారు. కళాశాలలో నిర్వహించే ఫెస్ట్‌లో ఉమ్మడి జిల్లాలోని 17 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు వారి ప్రాజెక్టులను ప్రదర్శిస్తారని తెలిపారు. ఉత్తమ ప్రాజెక్ట్‌లను ఎంపికచేసి రాష్ట్రస్థాయి ప్రదర్శనా పోటీలకు పంపుతామన్నారు. రెండురోజులపాటు నిర్వహించే ఫెస్ట్‌కు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక అతిథిగా హాజరవుతారని తెలిపారు.

అనంతలో మానవహక్కుల వేదిక
రాష్ట్ర మహాసభలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జిల్లాలో ఈనెల 14, 15వ తేదీల్లో మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యాజి శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో సభలు నిర్వహిస్తామన్నారు. కులగణన ఎందుకు అవసరం అనే అంశంపై సామాజిక విశ్లేషకుడు ఎస్‌వీన్ సాహు, బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు అనే అంశంపై స్వతంత్ర విలేకరి మాలిని సుబ్రహ్మణ్యం, కాషాయీకరణ, కార్పొరేటీకరణ అనే అంశాలపై చరిత్ర విశ్రాంత అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారన్నారు. అన్నివర్గాల ప్రముఖులు, ప్రజలు మహాసభల్లో విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎవరి మేలు కోసం..?

జిల్లాకు రెండేళ్ల కిందట 195 గోడౌన్ల మంజూరు

93 పూర్తి..

రూ.51 కోట్ల బిల్లుల చెల్లింపు

సహకారశాఖకు అప్పగించని మార్కెటింగ్ శాఖ

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

సొసైటీలపై మోయలేని వడ్డీ భారం

చక్రం తిప్పిన డెప్యుటేషన్ ఉద్యోగి



బుక్కరాయ సముద్రంలోని గోడౌన్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సొసైటీలకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు నిర్మించిన గోడౌన్లను సహకార శాఖకు స్వాధీనం చేయకుండా మార్కెటింగ్ శాఖ ఇంజనీర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం 195 గోడౌన్లను మంజూరు చేసింది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం నిధులు చెల్లించకుండా భారాన్ని ఆప్కాబ్, సొసైటీలపైనే మోపింది. దీంతో ఆప్కాబ్, ఏడీసీసీ బ్యాంకు, సొసైటీలు నాబార్డు నుంచి రుణాలు తీసుకుని గోడౌన్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. మూడేళ్లలో 93 గోడౌన్లను మాత్రమే పూర్తి చేశారు. వీటిని సహకార శాఖకు అప్పగించకుండా మార్కెటింగ్ శాఖ ఇంజనీర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటి వరకు చెల్లించిన రూ.51కోట్ల బిల్లుల రుణాలకు సంబంధించి సొసైటీల నుంచి వడ్డీ వసూలు చేస్తున్నారు. ఎటువంటి ఆదాయం (అద్దెల ద్వారా వచ్చే ఆదాయం) లేకనే వడ్డీ భారం సొసైటీలపై పడుతోంది.

బిల్లుల ఆమోదంలో ఆప్కాబ్ అధికారి పాత్ర కీలకం

గోడౌన్ల నిర్మాణం, బిల్లుల ఆమోదంలో ఓ ఆప్కాబ్ అధికారి కీలకంగా వ్యవహరించారు. ఆప్కాబ్ ఉద్యోగి గోడౌన్ల నిర్మాణం పేరుతో ఏడీసీసీ బ్యాంకుకు డెప్యుటేషన్‌పై వచ్చారు. విజయవాడలో ఉండాల్సిన ఆయన జిల్లాలోనే ఉంటూ చక్రం తిప్పుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తన పలుకుబడితో ఇక్కడికి వచ్చిన ఆ ఆప్కాబ్ అధికారి మూడేళ్ల డెప్యుటేషన్ గడువు ముగిసినా ఇక్కడే ఉంటున్నారు. గోడౌన్ల నిర్మాణానికి సంబంధించి వైసీపీ సానుభూతిపరులైన కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకే ఆయన డెప్యుటేషన్‌పై ఉంటూ బిల్లులు చెల్లిస్తూ ముడుపులు పుచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గోడౌన్లకు సంబంధించి కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు రూ.51కోట్లు చెల్లించారు. సాధారణంగా గోడౌన్ల నిర్మాణం పూర్తి అయిన తరువాత క్షేత్ర స్థాయిలో సహకార శాఖ, మార్కెటింగ్, ఏడీసీసీ బ్యాంకు, సొసైటీ అధికారుల బృందం పర్యవేక్షణ చేసిన అనంతరం బిల్లులు చెల్లించాలి. కానీ అవేవీ పట్టించుకోకుండా బిల్లులు చెల్లించేశారు. అయితే వీటిని వినియోగంలోకి తేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. జిల్లా కేంద్రానికి అతి సమీపంలోని బుక్కరాయసముద్రంలో నిర్మించిన గోడౌన్‌లో మందుబాబులు సకలం అక్కడే కానిచ్చేస్తున్నా పట్టించుకునేవారే లేరు.

మార్కెటింగ్ శాఖ ఇంజనీర్ల నిర్లక్ష్యం

ఉమ్మడి జిల్లాలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో 195గోడౌన్ల నిర్మాణానికి కేంద్రప్రభుత్వం అనుమతిచ్చింది. వీటిలో అనంతపురం జిల్లాలో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్లు 18, 500మెట్రిక్‌టన్నుల సామర్థ్యంతో 84 గోడౌన్ల నిర్మాణం చేపట్టారు. శ్రీతస్యసాయి జిల్లాలో వెయ్యి మెట్రిక్‌టన్నులకు సంబంధించి 21, 500మెట్రిక్ టన్నులకు సంబంధించి 72 మొత్తంగా 93 గోడౌన్లను నిర్మించాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు అనంతపురం జిల్లాలో 54, శ్రీసత్యసాయి జిల్లాలో 49గోడౌన్ల నిర్మాణం పూర్తి చేశారు. వెయ్యి మెట్రిక్‌టన్నుల గోడౌన్‌కు రూ.85లక్షలు, 500మెట్రిక్ టన్నుల గోడౌన్లకు రూ.45లక్షల నిధులు కేటాయించారు. నిర్మాణం పూర్తి చేసి ఏడాది కావస్తున్నా వీటిని సహకార శాఖకు స్వాధీనం చేయడంలో మార్కెటింగ్ శాఖ ఇంజనీర్లు నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారు.

సొసైటీలపై మోయలేని ఆర్థికభారం



గోడౌన్ల నిర్మాణం సొసైటీలకు ఆర్థిక భారం కలిగిస్తోంది. గోడౌన్ల నిర్మాణం పూర్తయిన వెంటనే ఉపయోగంలోకి వస్తే వాటి ద్వారా వచ్చే ఆదాయంతో సొసైటీలకు వెసులుబాటు కలిగేది. నాబార్డు ద్వారా ఆప్కాబ్‌కు, ఆప్కాబ్‌ద్వారా ఏడీసీసీ బ్యాంకుకు, ఏడీసీసీ బ్యాంకు నుంచి సొసైటీలకు రుణాలు చెల్లిస్తారు. సొసైటీలు తీసుకున్న రుణాలకు 4శాతం వడ్డీతో కలిపి తిరిగి బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు అప్పు ఇచ్చిన నాటి నుంచే వడ్డీ కట్టించుకుంటారు. అయితే గోడౌన్లు వినియోగంలోకి రాకపోవడంతో ఆదాయం లేక వడ్డీ భారం సొసైటీలపై తీవ్రంగా పడుతోంది.

మార్కెటింగ్ శాఖ ఇంజనీరుకు లేఖ పంపాం



నిర్మించిన గోడౌన్‌లను స్వాధీనం చేయాలని పలు మార్లు మార్కెటింగ్ శాఖ ఇంజనీరుకు లేఖ రాశాం. అయితే ఇప్పటి వరకు ఒక్కటి కూడా మా ఆధీనంలో కి రాలేదు. పూర్తి అయిన వాటికి బిల్లులు కూడా చెల్లించారు. స్వాధీనం చేయడంలో కాలయాపన చేస్తున్నారు. స్వాధీనం చేసిన అనంతరం ప్రారంభోత్సవం చేస్తాం. బిల్లుల చెల్లింపులన్నీ ఆప్కాబ్, మార్కెటింగ్ శాఖద్వారానే జరుగుతున్నాయి. ఇందులో మా ప్రమేయం ఏమీ ఉండదు. సొసైటీల నుంచి రికవరీ చేయాల్సి ఉంటుంది.

- అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

ఉన్నవ లక్ష్మీనారాయణ (జయంతి)



ఉన్నవ లక్ష్మీనారాయణ 1877 డిసెంబరు 4న గుంటూరులో జన్మించారు. గాంధేయవాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలుగు నవలా సాహిత్య వైతాళికుడిగా విశేషమైన కీర్తి పొందిన ఆయన సాహిత్యం ద్వారా హరి జనోద్ధరణకు కృషి చేసిన న్యాయవాది. ఆయన రచించిన నవల 'మాలపల్లి' తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక ముఖ్యమైన ఘట్టం. స్త్రీ విద్యకోసం శ్రీ శారదా విద్యానికేతన్ నెలకొల్పారు. గుంటూరులో యంగ్ ఉమెన్స్ లిటరరీ అసో సియేషన్‌ను, వితంతు శరణాలయాన్ని స్థాపించారు. వీరేశలింగం పంతులు అధ్యక్షతన తొలి వితంతు వివాహం జరిపించారు. కాగా ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నందుకు జైలు శిక్ష అనుభవించారు. 1958 సెప్టెంబరు 25న తుదిశ్వాస వీడారు.

ఘంటసాల (జయంతి)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత ఘంటసాల వెంకటేశ్వరరావు 1922 డిసెంబరు 4న కృష్ణా జిల్లా గుడివాడలో జన్మించారు. తెలుగు సినీ సంగీత దర్శకుడు, నేపథ్య గాయకుడు. పట్రాయని సీతారామ శాస్త్రి వద్ద క్షుణ్ణమైన శాస్త్రీయ సంగీత శిక్షణ పొంది రాణించారు. తెలుగు సినిమా తొలితరం నేపథ్య గాయకులలో ఘంటసాల ప్రముఖులు. ఎవరైనా పాటలు బాగా పాడుతున్నారంటే వారిని ఘంటసాల గారితో పోల్చేవారు, అంతలా ప్రభావితం చేశారనడంలో అతిశయోక్తి లేదు. 1951లో పాతాళ భైరవి విజయంతో ఘంటసాల పేరు మారుమోగింది. ఐరోపా, అమెరికాలలో కూడా సంగీత ప్రదర్శనలు చేశారు. వ్యాఖ్యానంతో సహా ఆయన ఆలపించిన భగవద్గీత ఎంతో ప్రజాదరణ పొందింది. 1970 వరకు దాదాపు ప్రతిపాట ఘంటసాల పాడినదే. ఎంత గొప్ప స్థితికి చేరుకున్నా తనను ఆదరించినవారిని మరువలేదు. 1974 ఫిబ్రవరి 11న కన్నుమూశారు.

శశికపూర్ (వర్ధంతి)



పద్మభూషణ్ గ్రహీత శశికపూర్ 1938 మార్చి 18న కోల్కత్తాలో జన్మించారు. పృథ్వీరాజ్‌కపూర్‌కు మూడో కుమారుడు, రాజ్ కపూర్, షమ్మి కపూర్‌లకు సోదరుడు. తండ్రి దర్శకత్వంలోని సినిమాల్లో నటుడిగా రాణించి సత్తా చాటుకున్నారు. హిందీ సినీ రంగంలో సోలో హీరోగా తనదైన గుర్తింపు పొందారు. నాలుగు జాతీయ ఫిల్మ్ అవార్డులు, రెండు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు తదితర గౌరవాలు అందుకున్నారు. 2017 డిసెంబరు 4న కన్నుమూశారు.

ఢిల్లీకి చేరిన బీజేపీ రెబెల్స్ కూటమి

» బెంగళూరులో కోర్ కమిటీ సమావేశం



బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో పార్టీ నాయకులు

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు ద్వారా రైతులకు నోటీసులు ఇచ్చి వేధిస్తోందని బీజేపీ రెబెల్స్ కూటమి ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ నేతృత్వంలోని పోరాటం పార్టీలో విబేధాలను తారస్థాయికి తీసుకెళ్లినట్టయ్యింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను వ్యతిరేకిస్తున్న కూటమి సభ్యులంతా ఢిల్లీకి చేరారు. రెండురోజులకిందటే యత్నాళ్ ఢిల్లీకి చేరుకోగా తాజాగా మంగళవారం రమేశ్ జార్కిహొళి, బీపీ నాయక్, అరవింద లింబావళి, కుమార బంగారప్ప, సంతోష్ తదితరులు వెళ్లారు. ఉదయం అల్పాహార భేటీలో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. వక్ఫ్‌బోర్డుపై దేశవ్యాప్తంగా సమగ్ర నివేదిక తయారు చేసేందుకు ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ ముందు హాజరై కర్ణాటకకు సంబంధించిన అంశాలపై నివేదిక ఇచ్చారు. కాగా క్రమశిక్షణా కమిటీ ముందు యత్నాళ్ హాజరయ్యారు. పార్టీ పరిధిలోనే పనిచేశానని, పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించలేదని వివరించినట్టు సమాచారం. అయితే పార్టీలో కొంతమంది కుట్రతో రాజకీయాలు చేస్తున్నారని, వారికి మాత్రమే వ్యతిరేకమని వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే క్రమశిక్షణా కమిటీ సంతృప్తి చెందిందా లేదా అనేది తెలియరాలేదు.

బెంగళూరులో కోర్ కమిటీ సమావేశం

పార్టీ కార్యాలయం బెంగళూరు జగన్నాథభవన్‌లో సంఘటనా పర్వ పేరిట కోర్ కమిటీ సమావేశం జరిగింది. పార్టీ అగ్రనేత యడియూరప్ప, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, రాష్ట్ర కో ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, కేంద్రమాజీ మంత్రి రాధాకృష్ణన్, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి, సీటీ రవి, రవికుమార్, కేప్టెన్ గణేశ్‌కార్నిక్, సదానందగౌడ, అశ్వత్థనారాయణ, నిర్మల్‌కుమార్ సురానా, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో సభ్యత్వంతోపాటు పలు అంశాలపై చర్చలు జరిగాయి. కాగా బుధవారం వక్ఫ్‌కు సంబంధించి బీదర్, కలబురగిలలో పార్టీ నాయకులతో కలసి పర్యటిస్తున్నట్టు అధ్యక్షుడు విజయేంద్ర ప్రకటించారు.

ప్రతిభ నాలుగుగోడలకే పరిమితం కారాదు

విజయపుర, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నేర్చుకున్న ప్రతిభ నాలుగు గోడలకే పరిమితం కారాదని బెంగళూరు గ్రామీణ జిల్లా విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ పీ బైలాంజనప్ప అభిప్రాయపడ్డారు. ఇక్కడ నేర్చుకున్న విద్యార్థులు భవిష్యత్తులో దేశ సాంస్కృతి రాయబారులుగానీ, నాటక రంగం కళాకారులుగానీ, రాజకీయ నేతలుగానీ కావచ్చునని ఇలా ఏ రంగంలోనైనా రాణించే అవకాశం ఉందన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పీయూ కళాశాలలోని హైస్కూల్ విభాగంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, గ్రామీణ జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రతిభా పోటీలు, కళోత్సవం 2024-25 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బెంగళూరు డయట్ డిప్యూటీ డైరెక్టర్ ఉషా కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ నుంచి గ్రాంట్లు తగ్గడంతో దాతల సహకారంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాలలో ఎన్నో నేర్చుకోవచ్చునన్నారు. పాఠశాల అభివృద్ధి సమితి ఉపాధ్యక్షుడు హనీఫుల్లా మాట్లాడుతూ జిల్లాస్థాయి విభాగాలలో విజేతలైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు కీర్తి తేవాలన్నారు. విద్యాశాఖ జిల్లా సబ్‌ప్లాన్ సమన్వయాధికారి కెంపయ్య మాట్లాడుతూ చిన్నారులలో దాగియున్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కాగా ఒక విద్యార్థి - ఒక దేశం అనే నినాదంతో కేంద్రప్రభుత్వం చేపట్టిన 12 అంకెలతో కూడిన అపార్‌ను నమోదు చేసుకోవాలని, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు ఆసక్తి చూపేలా అధికారులు ప్రోత్సహించాలన్నారు. వకృత్వ పోటీలు, ఏకపాత్రాభినయం, పద్మవేషం, యక్షగానం, భరతనాట్యం, ఖవాలి, వ్యాసరచన పోటీలలో 400కుపైగా విద్యార్థులు దేవనహళ్ళి, నెలమంగల, హొసకోటె, దొడ్డబళ్ళాపుర తాలూకాలనుంచి పాల్గొన్నారు. పురసభ సభ్యుడు నారాయణస్వామి, పాఠశాల అభివృద్ధి సమితి వెంకటేశ్, అశ్వత్థప్ప, సైపుల్లా, విద్యాశాఖ అధికారులు సుమా, రేఖా, పద్మ, కోమల తదితరులు పాల్గొన్నారు.




ప్రతిభా పోటీల ప్రారంభంలో బైలాంజనప్ప తదితరులు



యక్షగాన కళాకారుల బృందం

చారిత్రక స్థలాలను అభివృద్ధి చేయండి

» ఎంపీ డాక్టర్ సుధాకర్‌కు విజ్ఞప్తి



పుస్తకాలు ఎంపీ సుధాకర్‌కు అందజేత

బాగేపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అవిభాజ్య కోలారు జిల్లాలోని హాళుహంపెగా పేరొందిన బాగేపల్లి తాలూకాలోని గుమ్మనాయకనపాళ్య ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని లోక్‌సభ సభ్యుడు డాక్టర్ సుధాకర్‌కు విజ్ఞప్తి చేశారు. కేంద్రప్రభుత్వ 'ఢిల్లీ నుంచి హళ్ళికి' అనే అభియానలో చేళూరు తాలూకా చాకవేలు గ్రామపంచాయతీ పరిధిలో ప్రజల సమావేశంలో ఎంపీ పాల్గొని ప్రజల సమస్యలను ఆలకించారు. ఈ సందర్భంగా రచయిత, పరిశోధకుడు బీఆర్ కృష్ణ ప్రత్యేకంగా వినతిని అందచేశారు. బాగేపల్లి తాలూకాలోని చారిత్రాత్మక ప్రదేశాలు, విజయనగర సామ్రాజ్య ఆలయాలు సంస్కృతి లేపాక్షి కృతులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి 5వేల సంవత్సరాల చరిత్ర ఉందని ఆదిమానవుడు సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయని, శిలాయుగం గుర్తుగా జడమడుగు, అక్కమ్మబెట్ట, నవిలుగుట్ట తదితర స్థలాలు ఉన్నాయన్నారు. చారిత్రాత్మక ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు హరినాథరెడ్డి, కోనపరెడ్డి, గుజ్జేపల్లి సుధాకరరెడ్డి, ప్రొఫెసర్ కేటీ వీరాంజనేయ తదితరులు ఉన్నారు.

జ్ఞానాన్ని పెంచే వస్తువులను

సద్వినియోగం చేయండి

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జ్ఞానాన్ని పెంచే వస్తువులను సద్వినియోగం చేసుకుని ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశోధకులుగా ఎదగాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ జీఎల్ శివకుమార్ బాబు అభిప్రాయపడ్డారు. ఆక్స్‌ఫర్డ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం ఏర్పాటు చేసిన ఏఐసీటీఈ అటల్ భాగస్వామ్యంతో ఆరు రోజుల సిబ్బంది శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ బాబు మాట్లాడుతూ అధ్యాపకులు తమ సబ్జెక్టులలో మరింత జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఇటువంటి ట్రైనింగ్ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఎలక్ట్రికల్ వాహనాలు, హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్ వెహికల్ అంశమై ప్రయోగాత్మకంగా వివరించారు. ఆక్స్‌ఫర్డ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎన్‌వీఎల్ నరసింహరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఎన్ రమేశ్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ టీకే మంజునాథ్, కన్వీనర్ డాక్టర్ బీ దేవి విఘ్నేశ్వరి, డాక్టర్ నిషా సి రాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ శివకుమార్‌బాబుకు స్వాగతం

సేవా భావానికి ఎన్ఎస్ఎస్ కీలకం

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్నివర్గాలకు సేవా భావం పెంపొందించే ఆలోచన ఉండాలని, ప్రత్యేకించి విద్యార్థి దశలో పాటించడం ద్వారా ఎన్నో కొత్త అంశాలు తెలుసుకునేందుకు వీలుంటుందని గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంఆర్ సీతారాం అభిప్రాయపడ్డారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని జరిపారు. 450మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లుగా పాల్గొన్న కార్యక్రమంలో రామయ్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీఆర్ నాయుడు, ఈడీ హెచ్‌వీ పాశ్వనాథ, అకడమిక్ సలహాదారుడు డాక్టర్ కరి సిద్దప్ప, ఎన్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ పుట్టబైరేగౌడ, డాక్టర్ జీ రామచంద్ర పాల్గొన్నారు. విద్యార్థులు శ్రమదానంలో పాల్గొని సేవలందించిన మేరకు ప్రశంసా పత్రాలను అందజేశారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో నిర్వాహకులు

పోస్టాఫీసులు కిటకిట

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం సిద్దరామయ్యలు ఖాతాలకు నగదు వేస్తారనే ప్రచారం సాగడంతో కలబురగి పోస్టాఫీస్‌కు పెద్దసంఖ్యలో మహిళలు తరలివచ్చారు. సోమవారం ఆరంభమైన మహిళల రాక మంగళవారం కూడా కొనసాగింది. పోస్టాఫీస్ వద్ద పెద్దసంఖ్యలో మహిళలు క్యూలు కట్టారు. మహారాష్ట్రలోనూ బీజేపీ గెలిచిందని అందుకే ప్రధాని డబ్బులు వేస్తారనే ప్రచారం జరిగింది. డిజిటల్ అకౌంట్ ఉన్నవారికి మాత్రమే నగదు వేస్తారని ప్రచారం జరిగిందని పలువురు మహిళలు తెలిపారు. పోస్టల్ అధికారులు మాట్లాడుతూ ఎవరో తప్పుడు ప్రచారం చేశారని, వాటిని నమ్మరాదని సూచించారు. అయినాకూడా మహిళలు వస్తుండడంతో వారికోసం ప్రత్యేకమైన కౌంటర్ ఏర్పాటు చేసి సలహా సూచనలు చేస్తున్నట్టు తెలిపారు.

అగ్నివీర్ నాలుగో విడత సైనికుల పాసింగ్ అవుట్ పరేడ్

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బెళగావిలో అగ్నివీర్ నాల్గో విడత శిక్షణ పొందిన సైనికుల పాసింగ్ అవుట్ పరేడ్ మంగళవారం ఉత్సాహంగా సాగింది. మరాఠా లైట్ ఇన్‌ఫ్యాంట్రీ రెజిమెంటల్ సెంటర్ కమాండెంట్ బ్రిగేడియర్ జోయిదీప్ ముఖర్జీ గౌరవవందనం స్వీకరించారు. 650మంది అగ్నివీర్ సైనికులు 31వారాల శిక్షణలను పూర్తి చేసుకున్నట్టు ప్రకటించారు.



సైనికులతో ఉన్నతాధికారులు

పట్టుగూళ్లు కేజీ రూ.778

శిడ్లఘట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టుగూళ్ల మార్కెట్‌లో రికార్డు స్థాయిలో కిలో పట్టుగూళ్లు రూ.778గా పలికింది. వాతావరణంలో మార్పుల కారణంగా ధరలు పలికినట్టు తెలుస్తోంది. తాలూకాలోని కన్నమంగల గ్రామ శ్రీనివాస్ అనే రైతు కోలారు గిడ్డప్పనహళ్ళిలో పెంచిన పట్టుగూళ్లు నాణ్యతగా వచ్చాయి. 137 కేజీల పట్టుగూళ్లను మార్కెట్‌కు మంగళవారం తెచ్చారు. కిలో రూ.778 ధర పలకడం ఒక రికార్డుగా నిలిచింది. దీంతో రైతు సంతోషం వ్యక్తం చేశారు.



మార్కెట్‌లో పట్టుగూళ్లు...

డీకేహళ్లిలో చెత్తదిబ్బల తొలగింపు



చెత్తదిబ్బను తొలగించి కుండీలు ఏర్పాటు చేసిన అధికారులు

బంగారపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని అత్యధిక సభ్యులు కల్గిన డీకే హళ్ళి పట్టణ పంచాయతీ పరిధిలోని దాసరహొసహళ్ళి గ్రామం, ఇతర మార్గాలు, పారిశ్రామిక వాడ మార్గాల్లో పేరుకున్న చెత్తదిబ్బలను తొలగించారు. చెత్తదిబ్బలు పేరుకుపోవడంపై కథనం రావడంతో అధికారులు స్పందించారు. డీకేహళ్ళి పంచాయతీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్ మాట్లాడుతూ గ్రామాల పరిధిలో స్వచ్ఛత కాపాడేలా చర్యలు చేపట్టామన్నారు. వెంటనే పలు చట్ల చెత్త సేకరణ తొట్టెలు ఏర్పాటు చేస్తామన్నారు. దాసరహొసహళ్ళి ప్రధాన రహదారిపై స్వచ్ఛభారత్ కింద చెత్తతొట్టెలను ఏర్పాటు చేశారు. కాగా చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదని, దుకాణదారులు, హోటళ్ళ నిర్వాహకులను హెచ్చరించారు. ప్రజలలో కూడా జాగృతి కల్పిస్తామన్నారు. చెత్త సేకరణకు ఇప్పటికు రెండు వాహనాలు అందుబాటులో ఉన్నాయని వాటికి జీపీఎస్ కూడా అమర్చామన్నారు. ప్రతిరోజూకూడా చెత్తను తొలగించేలా సిబ్బందికి సూచించామన్నారు. కేయూడీఏ అధ్యక్షుడు గోపాలరెడ్డి మాట్లాడుతూ హెచ్‌పి నగర్, భారత్‌నగర్ ప్రాంతాల్లో చెత్త సేకరణకోసం చిన్న ఆటోలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. పీడీఓ వేణు మాట్లాడుతూ కేజీఎఫ్ నుంచి వచ్చే ప్రజలు ద్విచక్రవాహనాలలో వచ్చి రోడ్డుపై చెత్త పడేస్తుండడంతోనే సమస్య తలెత్తుతోందని అలా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 26,690 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 20,400తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 21 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

విద్యార్థినిపై అత్యాచారం

» కలబురగి జిల్లాలో నిరసన

బెంగళూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఐదో తరగతి విద్యార్థినిపై అత్యాచార సంఘటన కలబురగి జిల్లా యడ్రామి తాలూకా పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చోటు చేసుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ హాజిమలంగా గణియారను పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థిని మూడేళ్లుగా ఇదే పాఠశాలలో చదువుతు న్నారు. రెండు రోజులక్రితం బాలికపై ప్రిన్సిపాల్ దారుణానికి పాల్పడ్డాడు. ఇంట్లో చెప్పకూడదని బెదరించిన మేరకు విద్యార్థిని భయపడింది. ఇంటి పక్కన ఉండేవారికి విద్యార్థిని తెలపడంతో సోమవారం సాయంత్రం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రిన్సి పాల్‌ను అరెస్టు చేశారు. కలబురగి జిల్లా పరిధిలోని బంజారా సముదాయానికి చెందిన పలు సంఘాలతో పాటు కరవే తదితర ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున తరలివచ్చి యడ్రామిలో మంగళవారం నిరసన తెలిపాయి. దారుణానికి పాల్పడిన వ్యక్తిని మాకు అప్ప గించాలని డిమాండ్ చేశారు. వందలాదిమంది నిర సనలో పాల్గొన్నారు. బీఈఓ పాఠశాలకు సెలవు ప్రకటించి సమగ్ర వివరాలు సేకరించేందుకు సిద్ధమయ్యారు.

ఆగని వర్షం



నగరంలో వర్షంలో వాహన సంచారం

బెంగళూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావం మరోరోజు కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. దాదాపు 8 జిల్లాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన విషయం విదితమే. ఉడుపి, దక్షిణకన్నడ, ఉత్తర కన్నడ, చిక్కమగళూరు, కొడగు, శివమొగ్గ జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. జనజీవనం స్తంభించి నట్టయ్యింది. బెంగళూరులో మధ్యాహ్నం ఆరంభమైన వాన సాయంత్రం దాకా కురిసింది. ఈ ప్రభావంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు రోడ్లలో నీరు నిల్వ ఉండడంతో సంచారానికి జనం ఇబ్బంది పడ్డారు. కాగా మైసూరు చాముండి కొండలపై అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడ్డాయి. రోడ్డుపైకి భారీ బండరాయి దొర్లుకుని వచ్చింది. అయితే అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. రాకపోకలను నిషేధించి సహాయక చర్యలు కొనసాగించారు.



ఇద్దరు పెళ్లాల ముద్దుల దొంగ..!

- ఏడుగురు పిల్లలతో పోషణ భారం
- దిక్కుతోచక చోరీలకు దిగిన పెయింటర్
- ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో 41 కేసులు
- మరో ఇద్దరితో కలిపి పట్టుకున్న పోలీసులు
- 31తులాల బంగారం.. కారు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులు ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి 310 గ్రాముల బంగారు ఆభరణాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. దొంగల ముఠా నాయకుడు షేక్ ఖాజా పీరాపై ఏపీ, కర్ణాటక, తెలంగాణలో మొత్తం 41 కేసులు ఉన్నాయి. అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జగదీష్ నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి, కేసుల వివరాలు వెల్లడించారు. వివిధ రాష్ట్రాలలో దొంగతనాలకు పాల్పడుతున్న ధర్మవరం పట్టణానికి చెందిన షేక్ ఖాజాపీరా, మహేష్, జమీర్‌ను అరెస్టు చేశామని తెలిపారు.

జైలుకు వెళ్లొచ్చాక జతగాళ్లు

ముఠా నాయకుడు షేక్ ఖాజాపీరా వృత్తి రీత్యా పెయింటర్. ఇతనికి ఇద్దరు భార్యలు, ఏడుగురు పిల్లలు. పెయింటింగ్ ద్వారా వచ్చే డబ్బు సరిపోకపోవడంతో దొంగతనాలు ప్రారంభించాడు. 2021 నుంచి తాళం వేసిన ఇళ్లకు ఒక్కడే వెళ్లి చోరీలకు పాల్పడేవాడు. అనంతపురం జిల్లా సహా రాష్ట్రంలో 14, కర్ణాటకలోని బాగేపల్లిలో 4, కోలార్ జిల్లాలో 5, తెలంగాణలోని షంషాబాద్‌లో 4 దొంగతనాలు చేశాడు. అప్పట్లో నమోదైన ఈ 27 కేసులలో జైలుకు వెళ్లి.. ఈ ఏడాది మార్చిలో బయటకు వచ్చాడు. ఆ తరువాత కూలి పనులకు వెళ్లే మహేష్, జమీర్‌ను కలుపుకుని దొంగతనాలను తిరిగి ప్రారంభించాడు. అనంతపురం రూరల్, త్రీటౌన్, ఫోర్త్‌టౌన్, యాడికి, ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 10 దొంగతనాలు, కర్ణాటకలోని కోలార్ జిల్లాలో 4 దొంగతనాలు చేశారు. వీరు కారును బాడుగకు తీసుకుని వెళ్లి చోరీలకు పాల్పడేవారు. జమీర్ డ్రైవింగ్ చేసేవాడు. తాళం వేసిన ఇళ్లను ఎంపిక చేసుకున్న తరువాత.. మహేష్, జమీర్ బయటే ఉండి ఎవరూ రాకుండా నిఘా ఉంచుతారు. ఖాజా ఒక్కడే ఇంట్లోకి వెళ్లి విలువైన ఆభరణాలను ఎత్తుకొచ్చేవాడు. వీరిపై అనంతపురం సీసీఎస్ పోలీసులు, రూరల్ పోలీసులు నిఘావేసి అరెస్టు చేశారు.

మరో చోరీ కోసం వచ్చి..


అనంతపురం నగర శివారులో మరో చోరీ కోసం ముఠా ప్రయత్నిస్తూ పోలీసుల కంట పడింది. కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ కారు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు వాహనంతో పాటు ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వ్యవహారం బయటపడింది. సీసీఎస్ సీఐ ఇస్మాయిల్, రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రాంబాబు వారిని అరెస్టు చేశారు. వారితో పాటు హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, మల్లికార్జున, చంద్రశేఖర్, గిరిబాబు, జయకర్, కానిస్టేబుళ్లు శివయ్య, పాండవ, ఆంజనేయప్రసాద్, రంజిత్, బాలకృష్ణ, షామీర్, రాజశేఖర్‌ను ఎస్పీ అభినందించారు.

కొత్త సెక్షన్ కింద..

నిందితులపై బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్పీ జగదీష్ తెలిపారు. ఆర్గనైజ్డ్ క్రైం కింద యావజ్జీవ కారాగార శిక్ష పడే సెక్షన్ కింద వీరిని రిమాండ్‌కు పంపుతామని తెలిపారు. దొంగతనం కేసుల్లో ఇదివరకు ఐదేళ్ల, ఏడేళ్ల జైలు శిక్ష పడేదని, ఇప్పుడు శిక్ష మరింత కఠినతరమైందని తెలిపారు. ఊళ్లకు వెళ్లే సమయంలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను ఉపయోగించుకోవాలని ప్రజలకు ఎస్పీ సూచించారు. పోలీసులకు సమాచారం ఇస్తే.. ఆ ఇంట్లో కెమెరా ఇన్‌సర్ట్ చేస్తారని, ఇంట్లోకి దొంగలు వస్తే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చని తెలిపారు. అల్మరా, బీరువాలకు తాళం వేయకుండా నిర్లక్ష్యం వహిస్తుంటారని, అలా చేయొద్దని సూచించారు. బంగారు ఆభరణాలను లాకర్‌లో పెట్టాలన్నారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.66	1,592.60
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,173	933
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,580	1,929
నీటి నిల్వ (టీఎంసీలు)	92.80	13.34

లారీ బోల్తా

కంప్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : కంప్లి కోటలో మంగళవారం తెల్లవారుజామున సుంకులమ్మ దేవస్థానం వద్ద అదుపుతప్పి లారీ బోల్తా పడింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గంగావతి నుంచి తమిళనాడు వెళ్తున్న లారీ రాత్రి ఒంటి గంట సమయంలో ఇరుకుగా వున్న రోడ్డులో ఎదురుగా వస్తున్న వాహనానికి సైడు ఇవ్వబోయి అదుపుతప్పి గోతిలో పడింది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణనష్టం కలుగలేదు. డ్రైవర్‌కు గాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కంప్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



బోల్తా పడిన లారీ

గుండెపోటుతో డ్రైవర్ మృతి

నాదెండ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో గల ధనలక్ష్మి స్పిన్నింగ్ మిల్లులో గుండె పోటుతో ఒక డ్రైవర్ మృతి చెందిన సంఘటన మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధనలక్ష్మి స్పిన్నింగ్ మిల్లులో దారాన్ని లోడు చేయించుకొనేందుకు సోమవారం రాత్రి 11 గంటల సమయంలో విజయవాడ నుంచి లారీ వచ్చింది. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో క్లీనర్ ఇబ్రహీంతో కలసి డ్రైవర్ ఇస్మాయిల్(58) అల్పాహారం తీసుకున్నాడు. తనకు గుండెలో నొప్పిగా ఉందని, వైద్యుని వద్దకు వెళ్దామని క్లీనర్‌కు చెప్పాడు. వెళ్ళేందుకు ఆటో ఎక్కుతుండగా గుండెపోటుతో కుప్ప కూలాడు. మృతుడు కర్నాటక రాష్ట్రంలోని బసవ కళ్యాణ్ పట్టణవాసిగా గుర్తించారు.

చిరుజల్లులతో ఇబ్బందులు



వర్షంలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

కంప్లి, డిసెంబరు 3(ఆంధ్ర జ్యోతి): గత రెండు మూడు రోజులుగా ఫెంగల్ తుఫాను ప్రభావంతో బళ్లారి, విజయనగర జిల్లాల్లో చిరుజల్లుల వర్షం రావడంతో ఇటు రైతులకు, ప్రజలకు విద్యార్థులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయనగర జిల్లాలోని హగరి బొమ్మనల్లి, హరప్పనహళ్లి తాలుకాలో గత రెండు మూడు రోజులుగా కురిసిన వర్షాలకు విద్యార్థులకు పాఠశాలలకు వెళ్లక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి తోడు విద్యార్థులను తమ తల్లిదండ్రులు పాఠశాలకు తీసుకెళ్లి, తీసుకు వస్తున్నారు. వరి, మొక్కజొన్న తదితర పంటలపై కూడా ఈ చిరుజల్లులు ఎంతో నష్టంగా మారిందని తెలిపింది.

'ఫెంగల్' నష్టంపై ప్రధాని మోదీ ఆరా

అడయార్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన ఫెంగల్ తుఫాన్ కారణంగా రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో అపారనష్టం వాటిల్లింది. దీంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. తుఫాను బాధిత జిల్లాల్లో జరిగిన నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు సీఎంకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఇదిలావుంటే, ప్రధాని మోదీ ఫోన్ చేసిన విషయంపై ముఖ్యమంత్రి స్టాలిన్ తన ఎక్స్ పేజీలో ట్వీట్ చేశారు.

హెచ్‌ఐవీ బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

● సివిల్ న్యాయాధికారి రాజేష్ ఎన్.హొసమనె



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సివిల్ న్యాయాధికారి రాజేష్ ఎన్.హొసమనె

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బాధితులు మానసికంగా కుంగిపోకుండా వారిలో ఆత్మస్థైర్యం నింపాలని , సమాజంలో వారు ధైర్యంగా జీవించేలా అవకాశం కల్పించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ ఎన్.హొసమనె సూచించారు. బెంగళూరుకు చెందిన రాష్ట్ర ఎయిడ్స్ ప్రివెన్షన్ సొసైటీ, జిల్లా పాలనా మండలి, జిల్లా పంచాయతీ, జిల్లా చట్టసేవ ప్రాధికార , జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'నా ఆరోగ్యం-నాహక్కు' కార్యక్రమంలో భాగంగా నగరంలో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సభాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాటాడారు. నాలుగు దశాబ్దాల క్రితం వెలుగు చూసిన హెచ్‌ఐవీ మహమ్మారి ప్రపంచం మొత్తం వ్యాపించిందని, హెచ్‌ఐవీ సోకిన వారిని మానవీయ దృష్టితో చూడడంతో పాటు వారిలో ధైర్యం నింపే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్‌వై.రమేష్ బాబు మాట్లాడుతూ, 1980 సంవత్సరంలో మొదటి సారిగా డిసెంబరు 1వతేదీన హెచ్‌ఐవీ వ్యాధి అరికట్టేందుకు ప్రపంచంలో అన్ని దేశాలు బాధ్యత తీసుకున్నాయని, ఇది జాతీయ కార్యక్రమంగా ప్రారంభించిందన్నారు. హెచ్‌ఐవీ సోకకుండా జాగ్రత్త పడడం అందరి బాధ్యత అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఇంద్రాణి మాట్లాడుతూ జిల్లాలో హెచ్‌ఐవీ బాధితులకోసం ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యజీవన, సౌఖ్యబెళకు సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు చేపడ్తున్నామన్నారు. అనంతరం జాగృతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ పూర్ణిమా కట్టిమని, జిల్లా కుష్టురోగ నియంత్రణ అధికారి డాక్టర్ వీరేంద్ర కుమార్, నిత్యజీవన సంస్థ అధ్యక్షుడు హేమలత, జిల్లా ఆరోగ్య శిక్షణాధికారి ఈశ్వర్ దానప్ప, పాఠశాల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల భవన నిర్మాణానికి సహకారం: ఎమ్మెల్యే

సిరుగుప్ప, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు నూతనంగా భవనం నిర్మాణ పనులకు సహకరిస్తామని ఎమ్మెల్యే బీఎం నాగరాజు హామీ ఇచ్చారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం నీలకంఠేశ్వరాలయంలో నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, పదాధికారులు పదవీబాధ్యతలు, అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న ఉద్యోగులు భవనాన్ని పునర్నిర్మిస్తామన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు టెక్కలకోట ఉచ్చీరప్ప, రాష్ట్ర పరిషత్ సభ్యులు హనుమంతప్ప, గౌరవాధ్యక్షులు డాక్టర్ ఈరణ్ణ, ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, పదాధికారులను ఎమ్మెల్యే పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీఎం సతీష్, జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శివాజీరావు, విద్యాశాఖాధికారి గురప్ప, తాలుకా సాంఘీక సంక్షేమశాఖ డైరెక్టర్ సిద్దయ్య డైరెక్టర్ శివకుమార్, మాజీ అధ్యక్షులు లింగరాజ రెడ్డి పాల్గొన్నారు.



నూతన అధ్యక్షుడు టెక్కలకోట ఉచ్చీరప్పను సన్మానిస్తున్న ఎమెల్యే

దివ్యాంగులు అద్భుతాలు సృష్టించగలరు: ఎమ్మెల్యే

బళ్లారి సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు శక్తివంతులని, తమ శక్తితో ఉన్నత స్థానానికి ఎదగగల సత్తా ఉందని కర్ణాటక చేనేత అభివృద్ధి సంస్థ లిమిటెడ్ అధ్యక్షుడు,కంప్లి ఎమ్మెల్యే గణేశ్ పేర్కొన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ , జిల్లా న్యాయ సేవల ప్రాధికారసంస్థ, దివ్యాంగులు , వయోవృద్ధుల సాధికారత శాఖ, మహిళా శిశు అభివృద్ధి శాఖ, జిల్లా పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని దొడ్డనగౌడ రంగమందిరంలో మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. శారీరకంగా, మానసికంగా బలమైన వ్యక్తులు మాత్రమే విసుగు ,కష్టతరమైన జీవితాన్ని గడుపుతారు. కానీ దివ్యాంగులు ఎలాంటి ఆసరా లేకుండా జీవించగలరన్నారు. దివ్యాంగుల మధ్య ఐక్యత, ఏకాభిప్రాయం నెలకొని ప్రభుత్వం చేస్తున్న పథకాలు లేదా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ మహ్మద్ జుబేరా మాట్లాడుతూ దివ్యాంగులను చిన్నచూపు చూడరాదని, శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ లాంటి మేధావులు వైకల్యాన్ని జయించి అద్భుతాలు సాధించారన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ,సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ హొసమనె మాట్లాడుతూ వైకల్యం శాపం కాదన్నారు. వికలాంగులు అధైర్యపడకుండా ఆత్మవిశ్వాసంతో తమ హక్కులను సాధించుకుని ముందుకు సాగాలన్నారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ ముల్లంగి నందీశ్, మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్ ,జిల్లా వికలాంగులు,సీనియర్ సిటీజన్స్ ఎంపవర్‌మెంట్ వెల్‌ఫేర్ అధికారి గోవిందప్ప, వివిధ సంఘాల ఆఫీసు బేరర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేశ్

ఇళ్లను కూల్చి బతుకులు రోడ్డుపాలు చేస్తారా..?

● బలవంతం చేస్తే ఉరేసుకుని చస్తాం ● బాధితుల ఆవేదన ● తోరణగల్లులో ఉద్రిక్తత

తోరణగల్లు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇండ్ల స్థలాలు ఖాళీ చేయించడంలో ఉద్రిక్తత నెలకొంది. సండూరు తాలూకా తోరణగల్లులో మంగళవారం నాలుగు వేల కుటుంబాలకుపైగా రోడ్డెక్కాయి. నాగిరెడ్డి అనే వ్యక్తికి రైల్వే స్టేషన్ సమీపంలో 8 ఎకరాలకుపైగా స్థలం ఉంది. దీనిని కొందరు ఆక్రమించుకున్నారని ఆయన కోర్టును ఆశ్రయించారు. కోర్టులో ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. స్థలాన్ని ఖాళీ చేయించి ఆయనకు అప్పగించాలని పోలీసులకు కోర్టు ఉత్తర్వులు జారీ చేసిది. 1961 నుంచి ఇక్కడే ఇళ్లుకట్టుకుని జీవనం సాగిసున్నామని, ఇప్పుడు ఖాళీ చేయమంటే ఎక్కడికి పోవాలని సుమారు 4 వేల కుటుంబాలు ఆందోళనకు దిగారు. కోర్టు ఉత్తర్వులతో నాగిరెడ్డి లాయర్లు, పోలీసు బందోబస్తుతో ఆక్రమిత స్థలం వద్దకు వచ్చారు. స్థలం కొలవడానికి ప్రయత్నిస్తుండగా ప్రజలు తిరగబడ్డారు. కొందరు స్థిరపడి దుకాణాలు, వ్యాపారసముదాయాలు సైతం నిర్వహించుకుంటున్నారు. అయితే ప్రైవేట్ స్థలంలో ఆక్రమణలు సరి కాదని, కోర్టు తీర్పును గౌరవించాలని పోలీసులు నచ్చజెప్పారు. అయితే ఇక్కడే రోడ్లు వేశారు..డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారన్నారు. ఇంత కాలం తన సొంత స్థలంలో ప్రభుత్వ నిధులతో పనులు చేస్తుంటే ఎందుకు అడ్డు చెప్పలేదని ప్రజలు నిలదీశారు. ఈ స్థలాలకు ఇంటి పన్ను కూడా కడుతున్నామని, ఇప్పుడు హక్కులు లేవంటే ఎలా అని నిలదీశారు. పోలీసులు మాత్రం ఇది కోర్టు ఉత్తర్వులు పాటించాలని, 48 గంటల్లో ఆక్రమిత స్థలం వదిలి అప్పజెప్పాలని కోరారు. ఇందులో తొలిత రెండు ఇళ్ల, తరువాత నాలుగు ఇళ్ల మరుసటి రోజు 8 ఇళ్ల కూల్చి స్థలాన్ని నాగిరెడ్డికి అప్పగించాలని కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని లాయర్లు తెలిపారు. ఇళ్లను కూల్చితే మేము రైల్వే స్టేషన్‌లోనే ఉరేసుకుని ఆత్మహత్యలు చేసుకుంటామని తాడుకట్టారు. వేలాది మంది రోడ్డుపైకి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వీరికి ఎంత నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినడం లేదు. రోడ్డుపై బైఠాయించారు. దీనితో బళ్లారి- విజయనగర జిల్లాల రాకపోకలు స్తంభించాయి. ఈ విషయం పై డీఎస్పీ గోకలేని విచారించగా కోర్టు ఉత్తర్వుల ప్రకారం పోలీసుల భద్రత కల్పించాలన్నారు. న్యాయస్థానం పేదల బతుకులను దృష్టిలో ఉంచుకుని న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.



రోడ్డుపై బైఠాయించిన మహిళలు



భారీగా చేరుకున్న పోలీసులు



వినతి పత్రం అందజేస్తున్న సవితా సమాజం సభ్యులు

ఎమ్మెల్యే యత్నాళ్ క్షమాపణ చెప్పాలి

● సవితా సమాజం డిమాండ్

బళ్లారి సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బీజాపూర్ ఎమ్మెల్యే బసవరగౌడ యత్నాళ్ బహిరంగ సభలో సవితా సమాజ్ నిషేధిత పదాలను ఉపయోగించడాన్ని నిరసిస్తూ మంగళవారం నగరంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు.ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు హెచ్ తిప్పన్న మాట్లాడుతూ ఎమ్మెల్యే బసవనగౌడ పాటిల్ యత్నాల్ సవితా సమాజ్‌కు చెందిన గిరిజనులను అవమానపరిచారన్నారు. గత ప్రభుత్వం నిషేధించిన పదాన్ని వక్ఫ్ ఆస్తులపై జరుగుతున్న బహిరంగ సభలో ఉపయోగించారన్నారు. దీనిపై ఎమ్మెల్యే యత్నాళ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కులమతాలకు అతీతంగా సేవలందిస్తున్న క్షురకులను అవమానించడం బాధాకరమన్నారు. ఏ సమాజాన్నీ అవమానపరిచే హక్కు ఎవ్వరికీ లేదన్నారు. ఆ సంఘం నాయకుడు ఎచ్ తిప్పన్న, సమాజ సభ్యులు జిల్లాకలెక్టర్ సిబ్బంది ద్వారా ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వినతి పత్రం అందజేశారు.

ఘనంగా బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి



బాబూ రాజేంద్రప్రసాద్ చిత్రపటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

బళారి సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సంజీవరాయన కోట ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కర్ణాటక రాష్ట్ర యాక్షన్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్ల గుర్కి మాట్లాడుతూ బ్రిటీష హయాంలో ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉంటూ రాజేంద్రప్రసాద్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. రాజ్యాంగ ముసాయిదా కమిటీకి అ గాంధీజీ,నెహ్రూ, వల్లబాయ్ పటేల్, మర్గదర్శకత్వంలో రాజ్యాంగ ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా అంబేద్కర్ నియమితులైయ్యారన్నారు. ముసాయిదా రూపొందించి ఆమోదించిన తరువాత రాజేంద్రప్రసాద్ బాధ్యతలు నిర్వర్తించడానికి దారి రక్షణ , అధ్యక్షుడిగా ఎన్నికయ్యారన్నారు. ఇది 26 జనవరి 1950న అమలు చేయబడింది. విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ ఉద్యమం, క్విట్ ఇండి యా వంటి పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన గాంధీజీకి ఇష్టమైన శిష్యుడిగా గుర్తింపు పొందారన్నారు. నిజమైన దేశభక్తుడిగా 1950 నుంచి 1962 వరకు వరుసగా పన్నెండేళ్ల పాటు విదేయతతో, నిజాయితీతో పాలించారని, ఆయన నాయకత్వ లక్షణాలను విద్యార్థులు అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దిల్షాద్‌బేగం, శశమ్మచ రామాంజనేయులు, గురుప్రసాద్, విజయ ముంద్రగి, సుమ పాల్గొన్నారు.

కోదండరామ దేవాలయంలో ప్రత్యేక పూజలు



కోదండరామాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కంప్లి, డిసెంబరు 3(ఆంధ్ర జ్యోతి): కంప్లి నారాయణ స్వామి క్యాంపులో మంగళవారం కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ధార్మిక పూజలు జరిపారు. పాడ్యమి సందర్భంగా మంగళవారం స్వామివారికి వివిధ పూజలు చేపట్టారు. మహిళలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

నేటి నుంచి కార్తీక దీపోత్సవాలు

అడయార్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఈ నెల 13వ తేదీ కార్తీక మహాదీప వేడుకలు జరుగనున్నాయి. కార్తీక మహాదీపోత్సవాలు బుధవారం ఉదయం 4 గంటలకు ధ్వజారోహణతో ప్రారంభించనున్నారు.13 సాయంత్రం ఎర్వతశిఖరంపై మహాదీపాన్ని వెలిగిస్తారు.

హోసూరు జోన్

నేలకొరిగిన రాగి పంట

హోసూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వేలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న రాగిపంటలు నేలకూలి పూర్తిగా నాశనమయ్యాయి. దీంతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో కృష్ణగిరి జిల్లాలో కొన్నిరోజులుగా అనూహ్యంగా వర్షాలు కురుస్తున్నాయి. హోసూరు, డెంకణీకోట, రాయకోట, తళి, కెలమంగలం, తదితర ప్రాంతాలో ప్రధాన పంట రాగి వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు వర్షంతో నష్టపోయామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతున్నారు.



దెబ్బ తిన్న రాగి పంట

7న విద్యుత్ కోత

హోసూరు డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి విద్యుత్ సర్కిల్, హోసూరు డివిజన్‌కు చెందిన 110-11 కె.వి సబ్‌స్టేషన్‌లో ఈనెల 7న అత్యవసర నిర్వహణా పనుల రీత్యా విద్యుత్ కోత ఉంటుందని అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్‌స్టేషన్, 110 కేవి జూజూవాడీ మరియు బేగేపల్లి, సబ్ స్టేషన్ వద్ద అవసరమైన విద్యుత్ పరికరాల నిర్వహణ పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. టీవీఎస్ నగర్, అందివాడి, మత్తిగిరి, టైటాన్ టౌన్‌షిప్, గాడిపాళ్యం, పాత మత్తిగిరి, యడేనల్లూరు, శివకుమార్ నగర్, కొత్తూరు, కొత్తగొండపల్లి, బొమ్మండపల్లి, మునీశ్వరనగర్, ద్వారకనగర్, మత్తం, న్యూహడ్కో, ఓల్డ్ హడ్కో, మహాలక్ష్మి నగర్, ఫేజ్1, ఫేజ్2, రాంనగర్, బస్టాండు, శ్రీనగర్, అప్పావు నగర్, కామరాజనగర్, అన్నా నగర్, టైటాన్ ఇండస్ట్రీస్, అశోక్‌లైలాండ్, ఫేజ్1, సిప్‌కాట్ హౌసింగ్ కాలనీ, నేతాజీ నగర్, బాలాజీనగర్, చిన్న యళసగిరి, ఆనందనగర్, శాంతపురం, అరసనట్టి, ఎన్‌జీజీఓఎస్ కాలనీ, కేసీసీ నగర్, సూర్యనగర్, బృందావన్ నగర్, అన్నామలై నగర్, కృష్ణానగర్, 110 కేవీ జూజూవాడి, బేగేపల్లి ప్రాంతం మూకొండపల్లి, బేడరపల్లి, దర్గా, సిప్‌కాట్ కాలనీ, అరసనట్టి, సిప్‌కాట్ ఫేజ్-1 సూర్య నగర్, భారతీనగర్, ఎంజీఆర్ నగర్, కామరాజనగర్, ఎళిల్‌నగర్, రాజేశ్వరీ లే అవుట్, నల్లూరు, చిత్తనపల్లి, మడివాళం, నల్లూరు అగ్రహారం చుట్టుపక్క ప్రాంతాలలో విద్యుత్‌కోత ఉంటుందని అధికారులు తెలిపారు.

కుటుంబ నియంత్రణపై జాగృతి

హోసూరు(కృష్ణగిరి), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో కుటుంబ నియంత్రణ గురించి మాట్లాడుకుందాం అనే అంశంపై పురుషులు కూడా కుటుంబ నియంత్రణలో పాల్గొనేలా పురుషులకు ఆధునిక కుటుంబ శస్త్రచికిత్స శిబిరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏటా రెండువారాల అవగాహన శిబిరం నిర్వహిస్తోంది. కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలకు సమాచారం అందిస్తున్నారు. కృష్ణగిరి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి, ప్రభుత్వ అసుపత్రులు, స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పురుష స్టెరిలైజేషన్ శిబిరాలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. కుని శస్త్ర చికిత్సలు చేసుకున్న పురుషులకు రూ.1100- ప్రోత్సాహకం ఇవ్వనున్నారు. ఆధునిక సరళమైన, సురక్షితమైన, కుట్టులేని, నొప్పిలేకుండా ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 7358124022, 8778474051 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురళ్ తెలిపారు. జిల్లా సహాయ కలెక్టర్ (జనరల్)పుష్ప, జాయింట్ డైరెక్టర్ గ్రామీణ సంక్షేమ శాఖ నారాయణస్వామి, నేషనల్ హెల్త్ గ్రూప్ మెడికల్ అధికారి షణ్ముగవేల్, స్టాటిస్టికల్ అసిస్టెంట్ కుమరేశన్ పాల్గొన్నారు.



పచ్చజెండా ఊపుతున్న రెవెన్యూ అధికారి ఎ. సాధనకురళ్

కొనసాగుతున్న వరద

● విల్లుపురం, కడలూరు, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల్లో గ్రామాలు జలమయం

చెన్నై, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావిత వర్షాలతో పాటు, ప్రధాన జలాశయాల నుండి విడుదలైన అదనపు జలాల కారణంగా విల్లుపురం, కడలూరు, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల్లో వరద కొనసాగుతూనే వుంది. ఈ నాలుగు జిల్లాల్లో సుమారు రెండు వేలకు పైగా కుగ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయి దీవులుగా మారిన ఆ గ్రామాలలో ప్రజలు ఆహారం కోసం, ఆదుకునేవారి కోసం ఎదురు చూస్తున్నారు. ఫెంగల్ తుఫాన్ కారణంగా పుదుచ్చేరి రాష్ట్రం, విల్లుపురం జిల్లాల్లో 50 సెంటీమీటర్లకు పైగా కుండపోతగా కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిన విషయం తెలిసిందే. భారీ వర్షాల కారణంగా విల్లుపురం కలెక్టర్ ఆఫీసు, కొత్త బస్‌స్టేషన్ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. తుపాను తీరం దాటిన తర్వాత విల్లుపురం జిల్లావాసులు ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో ఆదివారం అర్ధరాత్రి సాత్తనూరు డ్యామ్ నుంచి ఒకేసారి 1.80లక్షల ఘనపుడగుల అదనపు జలాలను విడుదల చేయడంతో ఆ జిల్లాలో ముప్పావు శాతం గ్రామాలు నీట మునిగాయి. విల్లుపురం పక్కనే ఉన్న కడలూరు జిల్లాలో పుదుచ్చేరి రాష్ట్రంలోనూ జలాశయాలు, చెరువులు పొంగి ప్రవహించడంతో జనవాస ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆకస్మిక వరదల కారణంగా కడలూరు తిరువెన్నై నల్లూరు, తిరుకోవిలూరు ప్రాంతాలకు వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. కడలూరు జిల్లాలో 115 గ్రామాలు, విల్లుపురం జిల్లాల్లో 240 గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. విల్లుపురం జిల్లాలో ఇప్పటి వరకు భారీ వర్షాలు, వరదల కారణంగా 11 మంది మృతిచెందారు. తమను ఆదుకునేందుకు అధికారులు ఎవరూ రాకపోడంతో గ్రామాల వారు ఆగ్రహం చెందిన మంగళవారం అరసూరు కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. దీనితో మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అగరం చిత్తామూరు గ్రామంలో వరదల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురయ్యారు. ఇదేవిధంగా కారపట్టు, ఆలంకులం, తిరుముండీశ్వరం సహా 50 గ్రామాలు ఇంకా వరద నీటిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో పదికి పైగా కార్లు, బైకులు వరదనీటి ప్రవహంలో కొట్టుకుపోయాయి.

కడలూరులో జలవిలయం...

ఓ వైపు ఫెంగల్ తుఫాన్, మరో వైపు తెన్‌పెన్నైయారు వరదల కారణంగా కడలూరు జిల్లాలో సుమారు 30 వేలకు పైగా ఇళ్లల్లో వరదనీరు చొరబడింది. పల్లపు ప్రాంతాల్లో చిక్కుకున్న 25 వేలమందిని ప్రభుత్వ ప్రత్యేక శిబిరాలకు తరలించారు. సోమవారం వేకువజాము నుంచి తెన్‌పెన్నైయారు వరదల కారణంగా పన్రుట్టి, కడలూరు తాళంగూడా వరకూ జనావాస ప్రాంతాలన్నీ జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. కడలూరు పెరియకంగనాంకుప్పం, గుండు ఉప్పలవాడి, తాళం కూడా తదితర ప్రాంతాల్లోని చెరువులన్నీ ఊళ్లపై పొంగి ప్రవహిస్తున్నారు. మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, జిల్లా అధికారులు కలిసి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రత్యేక శిబిరాల్లో బస కల్పిస్తున్నారు. ఈ జిల్లా వరద పరిస్థితుల నుండి పూర్తిగా కోలుకోవటం వారం రోజులు పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కృష్ణగిరి, ధర్మపురిలో...

ధర్మపురి, కృష్ణగిరి జిల్లాలో కుండపోతగా కురిసిన వర్షాల కారణంగా ఇప్పటి వరకూ 20 ఇళ్ల ధ్వంసమయ్యాయి. సుమారు 3 వేల హెక్టార్ల విస్తీర్ణం కలిగిన పొల్లాలోని పంటలు నీటిలో మునిగాయి. కృష్ణగిరి జిల్లాలో ఎన్నడూ లేని విధంగా 50 సెం.మీల చొప్పున వర్షం కురవటంతో ఊత్తంగరై, పరిసర ప్రాంతాల్లో చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఊత్తంగరై బస్టాండు, తిరుపత్తూరు రహదారి తదితర ప్రాంతాల్లో వరద పరిస్థితులు ఏర్పడ్డాయి.



కృష్ణగిరి జిల్లా ఊత్తంగరైలో నీట మునిగిన ఇళ్లు